# నేత్రదాన ప్రాముఖ్యత

"మరణానంతరం ఎన్ని గంటలులోగా నేత్రదానం చేయాలో తెలియక అనేకమంది కళ్ళు నేత్రదానం జరగకుండా బుగ్గిపాలు అవుతున్నాయి. జన బాహుళ్యంలో నేత్రదానం మరణానంతరం ఎంత సమయంలో చేయాలి, ఎవరి కళ్ళు నేత్రదానానికి పనికివస్తాయి అనే విషయంలో స్పష్టమైన అవగాహన ఉండాలి" అని ప్రముఖ వైద్యులు స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥జి.సమరం పేర్కొన్నారు. నేత్రదాన ప్రచార పక్షోత్సవాన్ని పురస్కరించుకుని డా॥మారు అధ్యక్షతన వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం జరిగిన నేత్రదాన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని "నేత్రదాన ప్రాముఖ్యత" పై ప్రసంగించారు. డా॥సమరం మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన బిడ్డ దగ్గర నుంచి ఏ వయస్సు వారైనా మరణానంతరం నేత్రదానం చేయవచ్చన్నారు. నేత్రదానం చనిపోయిన వారి కళ్ళనే తీసుకోవడం జరుగుతుందని, బ్రతికి ఉన్నవారి కళ్ళని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోరని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బు, చత్వారం, కళ్ళమసక ఉన్నప్పటికీ నల్లగుడ్డు ఆరోగ్యంగా ఉంటే మరొకరికి చూపుని ప్రసాదించడానికి తప్పకుండా పనికివస్తాయన్నారు. పచ్చకామెర్లు, ఎయిడ్స్, రేబీస్, సెప్టిసీమియా, కేన్సరు, వైరల్ ఎన్‌కెఫలైటిస్ వ్యాధులతో మరణించిన వారి నేత్రాలు నేత్రదానానికి పనికిరావన్నారు. వ్యక్తి మరణించిన ఆరు గంటలులోగా మృతుని నుంచి నేత్రాలని తీసుకోవాలని, అంతకంటే సమయం మించితే ఆ కళ్ళు మరొకరికి చూపునిచ్చేందుకు పనికిరాకుండా అవుతాయని అన్నారు. నేత్రదానం చేసిన కళ్ళతో బ్లడ్ గ్రూపులు, స్త్రీ పురుష తేడాలు, చిన్నాపెద్దా వయస్సు తేడాలు లేకుండా ఎవరివి ఎవరికైనా కార్నియాగ్రాఫ్టింగ్ ద్వారా అమర్చడానికి కుదురుతుందన్నారు. నేత్రదానంలో కేవలం మరణించిన వ్యక్తి నేత్రంలోని కార్నియాని మాత్రమే మరొకరికి అమర్చడం ఉంటుందని, మొత్తం కంటిగుడ్డుని పెట్టడం ఉండదని అన్నారు. నేత్రదానంతో చూపుని ప్రసాదించేది కేవలం నల్లగుడ్డు డ్యామేజి అయ్యి అంధత్వం కలిగి ఉన్నవారికే తప్ప ఇతర కారణాల వల్ల అంధత్వం పొందిన వారు కాదన్నారు. నేత్రదానంతో చూపు వచ్చే నల్లగుడ్డు అంధత్వం ఉన్నవాళ్ళు భారతదేశంలో 30 లక్షల మంది ఉన్నారని, కాని అవగాహనా రాహిత్యం వల్ల, అపోహలు వల్ల ఎంతోమంది నేత్రదానం చేయడం లేదన్నారు. సంవత్సరానికి కేవలం 12వేల మందే నేత్రదానం చేస్తున్నారన్నారు. భారతదేశంలో ఇప్పటికే ఉన్న 30లక్షల మందికి ఏటా మరో 20 వేల మంది వీరితో జమ అవుతున్నారన్నారు. మరణించిన వ్యక్తి నేత్రదానం విషయమై తన సంకల్పాన్ని తెలియచేయకపోయినప్పటికీ, కుటుంబ సభ్యులు చొరవ తీసుకుని నేత్రదానం చేయవచ్చన్నారు. ఒకవేళ ఎవరైనా తమ చివరి కోరిక నేత్రదానం అని ప్రకటించినప్పటికీ కుటుంబ సభ్యుల అంగీకారం లేకపోయినట్లైతే మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను తీసుకోవడం జరగదన్నారు. నేత్రదానం గురించి చట్టం లేకపోవడం వల్ల చాలామంది చివరి కోరికైనా నేత్రదానం అమలు జరగకుండా పోతోందని అన్నారు. నేత్రదానం చేయాలని అనుకున్నప్పుడు కుటుంబ సభ్యులు మృతుని కళ్ళమీద తడిగుడ్డ వేసి కళ్ళు ఎండిపోకుండా కాపాడాలని, ఈ లోపల ఐ బ్యాంక్‌కు తెలియచేయాలని అన్నారు. విజయవాడలో స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ మరణించిన వారి నేత్రాలని సేకరించి అంధులకు చూపుని ప్రసాదించడంలో చక్కని కృషి చేస్తోందని తెలియచేసారు. ప్రజలందరిలోనూ నేత్రదానం గురించి సరైన చైతన్యం ఉన్నప్పుడు నల్లగుడ్డు అంధత్వం సమస్య కానేరదని అన్నారు. ప్రతి ఒక్కరు నేత్రదానం గురించి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.